# శిక్ష

శివల జగన్నాథ రావు

ఆడపిల్లల బడి విడిచేరు. రోడ్డు కళ కళ లాడుతోంది. అంతా ఒకే రకం బట్టలు. మనుషులూ, అంతస్థులు మారినా, వయసులూ, గుణమూ మారనట్టు — పొడుగూ పొట్టీ; పెద్దా, చిన్నా; తెలుపూ, నలుపూ లావూ, సన్నం — ఇవే తేడాలు! ఏ రకం కుట్టించుకున్నా, రంగు అదే, బట్టలదే!....

వెళ్తున్నారు, ప్రవాహంలా. కబుర్లు చెప్పుకుంటూ — నవ్వుకుంటూ — ఒకొక్కరు తోసుకుంటూ, ఆత్రంగా, హడావిడిగా; వుత్సాహంగా, వుల్లాసంగా; తాపీగా, నిర్వంగానూ....

ఏ పిల్లయినా, ఇలా వచ్చి "రిక్షా కడతావా?" అని అడుగుతుందేమోనని రాజయ్య చూస్తున్నాడు. ఒక్క పిల్లకూడా వచ్చి అడగలేదు. అసలు వాళ్ళిటువేపు చూడందే!

వాళ్ళ సందడి మందగించింది.

కొంపలు మునిగిపోయినట్టు పరుగులు పెడ్తున్నాయి వాహనాలూ, మనుషులూను, ఇట్నుంచటూ, అట్నుంచిటూ కొంచెం దూరంలో వున్న కిళ్ళీ బడ్డీలోంచి ఏవో పాటలు వినబడుతున్నాయి. బడ్డీ ముందు ఇద్దరు కుర్రాళ్ళు నిలబడి, ఆ దార్నపోయే ఆడపిల్లల్ని చూపుల్తో తింటూ, వాళ్ళతో జోక్సు విసుర్తున్నారు.

రాజయ్య రిక్షా కింది సీటులో కూచుని చూస్తున్నాడు....

వరాలిచ్చే వేలుపు కోసం తపస్విలిలా —

పరీక్ష ఫలితాల కోసం విద్యార్థిలా —

ఎన్నికల్లో ఫలితాలకి అభ్యర్థిలా —

ఉద్యోగం కోసం నిరుద్యోగిలా —

బేరం కోసం, రాజయ్య...కళ్ళు వెడల్పు చేసుకుని చూస్తున్నాడు.

వెళ్ళిపోతున్నాయి, బస్సులు, ఇలావచ్చి, అలా....

వెళ్ళిపోతున్నారు, మనుషులు, వాట్లో ఎక్కి....

విసుగ్గా తలపాగా తీసి, రాజయ్య మొహం తుడ్చుకున్నాడు.

ఒకబట్టతలాయన సంచీపట్టుకునివస్తున్నాడు. సంచీబరువుగా వుంది. సంచీమీద మూడు గుర్రాల బొమ్మ మార్కుంది. ఆయన చేతుల మీదా, మొహంమీద చెమటెంతో వుంది. ఆయన ఆయాసంగా వున్నాడు.

రాజయ్య రిక్షాదిగి నిలబడ్డాడు.

ఆయన్ని చూసి కూడా "రిక్షా కావాలా, బాబూ?" అని అడగలేదు. "అనుభవం" రాజయ్యని అలా అడగవద్దంది. అది చెప్పినమాట వినకపోతే చెడడం ఖాయం అంటుంది వయసు, పరిస్థితి.... అలా అడిగితే "బేరం సులకనె పోతాది"! ఆయనంతటాయనే అడిగితేనే "అడిగినకాడికి ఇంకో రెండబ్బులు ముట్టేవీలు బాద"ని ఆశ!

"ఏయ్ రిక్షా కడతావా?"

"కడ్తాం బాబూ"

"చెంగలావుపేట.... తెల్సునా?"

"తెల్సండి"

"ఏమిస్తుంటావు?"

"తమరే సెప్పండి"

"రూపాయిస్తాను"

"కట్టదండి బాబూ"

ఆయన సంచీ మరో చేతికి మార్చుకున్నాడు. అటూయిటూ చూస్తున్నాడు.

"ఎంతిస్తుంటావయితే?"

"రూపాయ డబ్బులు సిత్రాలయం సినీమాహాలు కాడికిస్తారండి...."

"కనకమాలక్ష్మి గుడి కనేకమార్లిచ్చే నోట్ రూపాయి...."

"కిట్టదుబాబు .... అట్టాకట్టేవోల్లుంటే ఎల్లండి...."

"మీమాటే మీది...."విసుక్కొని ఇంకో పావలాయిస్తాను .... ఇంకబేర మాడకు!" అన్నాడాయన.

ఆయాసంగా అటిటూ చూస్తున్నాడు.

"తమరు మాకస్టం సూడాలయ్యా. సొగరావుపేటంటున్నారు. ఎక్కూదూరం అవునోకాదో తమకి తెలియందేవుంది?" అన్నాడు రాజయ్య, ఆయన బస్సుకోసమే చూస్తున్నాడని నిర్ధారణ చేసుకుని.

వస్తోంది, బస్సు, నిజంగానే!! యమవేగంతో, యముళ్ళా! ఆయన్నెత్తుకుపోతుంది! తన బేరాన్నెత్తుకుపోతుంది!

ఆయన సంచీ మళ్ళా మార్చుకుని, "అదిగో, బస్సు వచ్చేసిందిలే! నీతోవాదనకి పెట్టే శ్రమని, ఆబస్సు ఎక్కడంలో పెడ్తే, పావలాతో వెళ్ళిపోతాను...."అంటూ, గబగబా, ఆత్రంగా, హడావిడిగ, పరుగులాంటి నడకతో వెళ్ళిపోయాడు, బస్సు దగ్గరికి కాస్సేపక్కడ కొంతమంది రొద. బస్సెళ్ళిపోయింది, అక్కడందర్నీ తన్నోకిలాక్కొని.

తలపాగా ఒక్క దులుపు దులిపి, అటు చూస్తున్నాడు రాజయ్య.

అమృతాన్ని తమకొక్కకండా దక్కించుకున్న సురుల్ని, అసురులు చూసినట్టు,

తారని ఎత్తుకుపోయిన వాలిని సుగ్రీవుడు చూసినట్టు.

చేతిలోని తాయిలాన్ని సంగ్రహించిన కాకిని పిల్లాడు చూసినట్టు............

రోడ్డు మహారద్దీగావుంది. ఆత్రం, హడావిడీ, ఆర్భాటం, ఆయాసం, వేగం అక్కడ అనేక రూపాలెత్తి శివతాండవం ఆడుతోంది:

తలపైకెత్తి చూశాడు రాజయ్య.

ఆకాశం నీలంగా అందంగా వుంది. అలాచూస్తే అదెంతో ఆహ్లాదంగా కనిపిస్తోంది అంతనీలాన్ని ఎక్కణ్ణించి అదితెచ్చుకుంది? సముద్రంలోంచా?.... ఏమో?! కవిచూస్తే మనసు మురిసి, తనువు పులకించి, చక్కటి కవిత్వాన్ని వ్రాస్తాడు. రాజయ్య కవి కాదు. ఆ సమయంలో, అంత చక్కటి దృశ్యాన్ని తిలకించడానికి అతను కవే కానక్కర్లేదు.

మామూలు మనిషెవరైనా, కొంత స్పందన వున్నవాడు, ఆ సాయం సమయపు ఆకాశాన్ని చూసి హృదయం పులకించి తిరుతాడనుకోవచ్చు. కాని-ఆ సమయంలో రాజయ్య మనసు, అప్పటి ఆకాశం అంత స్వచ్ఛంగా, నిర్మలంగా, తేటగా, చక్కగా లేదు కనక, అతనది చూసి కూడా ఏమీ సంతోషాన్ని, స్పందననీ పొందలేదు.

రోడ్డు, టపటప వెలుగుతూన్న వీధి దీపాల కాంతిలో రంగరంగ వైభోగంగా వుంది. ఇంట ఎలావున్నా-ఇప్పుడుమాత్రం నిన్ను అరంగుళం ఎడబాసి వుండలేను, ప్రియా' అన్నట్టు, భార్యలు భర్తల్ని స్కూటర్లమీద కావిలించుకూచుని, గాలి దూసుకు పోతున్నారు. అందమైనకార్లు, అద్దాలోంచి వెన్నముద్దలాంటి రమణుల్ని మనోహరంగా చూపిస్తూ పోతున్నాయ్.


బస్సుని తిట్టుకుని రాజయ్య జేబులోంచి బీడీతీసి, ఆ పక్క-కిళ్ళీబడ్డీ దగ్గర కాల్తూన్న చేంతాడుతో అంటించుకున్నాడు. పొద్దుట్నించీ నాపిరకం బేరాలే యజమానికే విస్తాడు? తనకేటి మిగులు రెండ్రోజుల నాది మందేస్కూవి. నాలి పీకుతోంది. గుండె పీకుతోంది. ఇయాలేవయినా సరే. మందేస్కోవాలి. నర్సెవ టదో? ఇంటికి డబ్బులు సరిగ్గ తెచ్చినావు అవని బుగ్గెట్టుకోవస్తదేమో. ఇన్ని గుండవల కడుపులు మాడుస్తున్నావని ఏడెతాదేమో. అదెప్పుడు పోరెట్టేనేవ? ఇప్పుడు పిల్ల కోసమంటాది అదిలా కోకలకోసం. ముక్కపుడక్కోసం అంది. మొత్తానికెప్పుడూ కొంపలో గొడవే. యింతకీ నర్సి ముందొచ్చిందా? మందు ముందొచ్చిందా తన బతుకులోకి? మందే ముందు.

రాజయ్య చీకటి మొహంలో చిన్న దీపంలాగా చిరునవ్వు వెలిగింది. 'అన్నట్టు' పూర్ణాలోకి జ్యోతిలచ్చి బొమ్మ వొచ్చిందట. క్లీనరప్పిగాడు కితకితలు పెట్టిచెప్పేడు. తన్నూపేట్లు! పసందు గుంటట. అబ్బ!

యిద్దరు నడిచే పిల్లల్తో-సంకలో ఒకదానితో, పిల్లాడితో_ఒక నడివయసావిడ వచ్చింది. "పూర్ణా మార్కెట్టు దగ్గరకె తీస్కెంటా వోయ్?"

వగరుస్తోంది. పిల్లల్తో ఎంతవేగిరం అన్న పూర్ణా మార్కెట్టు కాడి చేరుకుంటానా_ అన్నట్టుంది.

"రూపాయిన్నరవుద్ది..."



అనేసి, నేలమీద పాతేసిన కొర్రులా బిగిసి నిలబడ్డాడు. ఆవిడ విసుగ్గా "అదేమిటోయ్? ఎంతయినా అంత ఆశవుండకూడదయ్యా! కాస్త ఎదటి మనిషిని చూసి చెప్పాలి...." అంది.

'కిట్టదమ్మా! అన్ని ధరలూ ఎలా పెరిగి పోతున్నాయో చూసేరుకాదా? రోజంతా కష్టపడి తొక్కితే ఏవొస్తది? మా ఇంటి నలుగురేం తినాల?" రాజయ్య విసుగ్గానే పలికేడు.

'పెరిగి పోతున్నాయి, నాయినా! ధరలేమిటి. అధర్మం ఏమిటి? అవినీతేవిటి? రవుడితనం ఏవిటి? మోసం ఏవిటి? అంతా ఒకర్నొకళ్ళు దోచడవే కాదూ? ఇదే యిప్పుడు నాగరికత! అయివుణ్ణి బలువుకు కొడితే.... వాణ్ణి బ్రహ్మదేవుడు కొచ్చేట్ట. ఎంత ముసుగులోదూరి ముండమోపివేషాలేశా అంత పెద్దమనిషి!" అంటూ గడగడా వల్లించి, అక్కణ్ణించి వెళ్తూన్న, ఇంకో ఖాళీ రిక్షాని పిలిచిందావిడ.

వాక్కడికో చెప్పి, ఎంతిస్తుంటాడో అడిగితే "రూపాయిన్నరివ్వండి" అన్నాడతగాడు.

ఒమ్మెలో పక్క వాడా తన అరుపే అరిస్తే కలిగే సంతోషంతో రాజయ్య "అదీ" మెచ్చుకున్నాడు.

ఆవిడ ఆ రిక్షా అతన్ని "కొంచెం చూడు, బాబూ! మా లాంటి వాళ్ళం అంతిచ్చుకోగలవా?" అని "బాబ్బాబు నేను తొరగా వెళ్ళాలి! కొంచెం కింద దిగవయ్యా! ఇదిగో నేను ఎన్నోసార్లు పూర్ణా మార్కెట్‌కి ముప్పావలా ఇచ్చేను. పోనీ, నా మాటా కాదు నీ మాటా కాదు. ఎనభై పైసలిస్తాను.... కట్టెయ్యి" అంది.

అతగాడు మూలిగి, దగ్గి. చివరగ్గా రూపాయికి ఒప్పుకొని, ఆవిణ్ణీ, పిల్లల్నీ ఎక్కించుకుని సాగిపోయాడు.

రాజయ్య రిక్షాతో నుంచుండి పోయాడు అటు చూస్తూ. రోడ్డు కలకలాడుతూనేవుంది.

రెండు జెళ్ళ్ - పారెన్ నైలెక్స్ - హైహీల్స్ షూస్ - బ్లాక్ టెరీకాట్‌పాంట్ లోకి దిగిన వైట్ స్పన్‌షర్ట్ - లేటెస్ట్ బ్రాండ్ బూట్ అండ్ హాండ్ బాగ్ - చకచక - టక టక - ఇవే!

జ్యోతిలచ్చి - కుసుపులు - కైపెం - మత్తు - మందు - సొరగం - కులాసా - నర్సి కాళికావతారం - గుంటలు - ఏడుపులు, రాదరాద - విసుగు - చేతగాని శౌర్యం, దిగిపోతున్న కోపం - దిగుతోన్న కోర్కెలు. ఆరిపోతున్న ఆశలు - ఆరిపోని బతుకు.

"నవరంగ్ టాకీస్‌కి...." అన్నాడాయన. ఎక్కుతూ. ఏమీ అనలేదామె. ఎక్కి కూచుంది. రిక్షా సాగిపోయింది.